# మిస్ ఇంగ్లండ్‌తో మిస్‌బిహేవ్!

## ప్రపంచ సుందరి పోటీల నుంచి వైదొలిగిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ

- 72 ఏండ్ల మిస్ వరల్డ్ చరిత్రలో ఇంగ్లండ్ పోటీదారు వైదొలగడం ఇదే తొలిసారి
- నిర్వాహకులు తమను ఎగ్జిబిషన్‌లో ఓ గ్లామర్ బొమ్మగా చూశారని ధ్వజం
- మధ్యవయస్కులైన మగవాళ్ల మధ్య అందర్నీ పరేడ్ చేయించారంటూ ఆవేదన
- డబ్బు ఉన్న వారిని సంతోష పెట్టే వస్తువులుగా తమను చూశారని మండిపాటు
- నిర్వాహకుల తీరుతో 'తాను వేశ్యనా ఏంటి?' అనే భావన కలిగిందని భావోద్వేగం
- యూకే పత్రిక 'ది సన్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వాపోయిన సుందరీమణి
- నిర్వాహకుల తీరుతో కొన్ని రోజులు నిద్రపట్టలేదు: 'నమస్తే తెలంగాణ'తో మ్యాగీ
- మ్యాగీ ఆరోపణలు నిరాధారం, అసంబద్ధం: మిస్ వరల్డ్ సంస్థ సీఈవో జూలీ మోర్లే
- అందాల పోటీలతో హైదరాబాద్, తెలంగాణ ప్రతిష్ఠ అభాసుపాలైంది: విశ్లేషకులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఆమె పేరు మిల్లా మ్యాగీ . వయసు 24 ఏండ్లు. వృత్తిరీత్యా స్విమ్మర్. ప్రపంచ సుందరి కిరీటాన్ని ముద్దాడాలని చిన్నప్పటి నుంచి ఆమెకు ఎంతో ఆశ. ఆ దిశగానే ఎన్నో కలలు గన్నది. తన మనసులో మాటను తల్లికి కూడా చెప్పింది. అది విన్న మ్యాగీ తల్లి.. "బిడ్డా.. అందాల పోటీ అంటే శారీరక సౌందర్యాన్ని మాత్రమే చూస్తారని అనుకోవద్దు. ఆత్మవిశ్వాసం, సేవాగుణం, స్ఫూరిని రగిలించే మంచి ప్రవర్తన, నడవడిక, చురుకైన ఆలోచనలు ఇలా అన్నీ మనలో ఉండాలి" అంటూ మ్యాగీ కి చెప్పింది. తల్లి మాటలు మ్యాగీ పై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. అందుకతగ్గట్టే తన ఉన్నత విద్య ముగియగానే 2024లో మిస్ ఇంగ్లండ్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచింది. దీంతో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో ఇంగ్లండ్ తరుపున పాల్గొనడానికి ఈ నెల 7న నగరానికి వచ్చింది. అయితే పదిరోజులు తిరక్కముందే మే 16న పోటీల నుంచి వైదొలుగుతూ ఇంగ్లండ్‌కు వెళ్లిపోయింది. వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా పోటీల నుంచి వైదొలుగుతున్నట్టు మ్యాగీ తొలుత ప్రకటించింది. మిస్ వరల్డ్-2025 పోటీల నుంచి వైదొలుగుతున్నట్టు మ్యాగీ ప్రకటించడం ఒక్క ఇంగ్లండ్‌లోనే కాదు యావత్తు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. 72 ఏండ్ల ప్రపంచ సుందరి పోటీల్లో ఇంగ్లండ్ నుంచి ఓ పోటీదారు కాంపిటీషన్ మధ్యలోనే వైదొలగడం ఇదే మొదటిసారి. దీంతో ఇంగ్లండ్ కేంద్రంగా పనిచేస్తున్న 'ది సన్' పత్రికకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ పాల్ సిమ్స్.. పోటీ నుంచి నిష్క్రమించడానికి గల కారణాలను మ్యాగీ ని అడిగి తెలుసుకొన్నారు. ఈ ఇంటర్వ్యూలో మ్యాగీ 'మిస్ వరల్డ్ పోటీలు' నిర్వహణ తీరు, ప్రతినిధుల వైఖరిపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

### అంగట్లో బొమ్మలుగా..!

'ది సన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిల్లా మ్యాగీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనడానికి మే 7న నగరానికి చేరుకున్నట్టు చెప్పారు. పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు పాత కాలం తరహాలో, అధ్వానంగా ఉన్నట్టు వాపోయారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన సుందరీమణులు 109 దేశాలకు ప్రతినిధులన్న సంగతిని కూడా నిర్వాహకులు మరిచిపోయారని మండిపడ్డారు. తమతో దారుణంగా వ్యవహరించేవారని వెల్లడించారు. తమను ఎగ్జిబిషన్‌లో గ్లామర్ బొమ్మలుగా ట్రీట్ చేస్తూ 24 గంటలపాటూ మేకప్, బాల్ గౌన్‌లతోనే ఉండమంటూ నిర్వాహకులు ఒత్తిడి తెచ్చేవారని వాపోయారు. బ్రేక్‌ఫాస్ట్ చేసేప్పుడు కూడా మేకప్‌తోనే ఉండాలంటూ చెప్పేవారని తెలిపారు. మధ్యవయస్కులైన పురుషుల ముందు తమను పరేడ్ చేయించేవారని వాపోయారు. డబ్బు ఉన్న కొందరు ధనవంతులు కూర్చున్న టేబుల్‌ల దగ్గర తమను గంటలపాటు ఉండాలంటూ ఒత్తిళ్లు తీసుకొచ్చారని, ఆరుగురు కూర్చున్న ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరేసి పోటీదారులు ఉండేవారని గుర్తుచేశారు. ఆ ధనవంతులు ఏం చెప్పినా తాము కృతజ్ఞతలు చెప్తూ రాత్రంతా ఆ టేబుల్‌ల దగ్గరే ఉండాల్సి వచ్చిందని వాపోయారు. "ముందు ఇవన్నీ నేను నమ్మలేకపోయా. జరుగుతున్న పరిణామాలతో షాక్‌కు గురయ్యా. ఇవన్నీ నాకు తప్పుగా అనిపించాయి. ధనవంతులను అలరించేందుకు నేను ఇక్కడికి రాలేదు అనిపించింది. మిస్ వరల్డ్ పోటీలు విలువలతో ఉంటాయని భావించి వచ్చా. అయితే ఇక్కడ అలా లేదు. గతంలో జరిగినట్టే ఇంకా కొనసాగుతున్నది. మొత్తంగా నిర్వాహకుల తీరుతో నేనేమైనా వేశ్యనా ఏంటి? అనే భావన నాకు కలిగింది" అని మ్యాగీ భావోద్వేగానికి లోనయ్యారు.

### ఏదో సాధించాలని వచ్చా.. కానీ!

భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచి ఏదో సాధించాలన్న ఆశతో తాను ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చానని 'ది సన్' ఇంటర్వ్యూలో మ్యాగీ అన్నారు. కానీ ఊహించని అనుభవాలు తనకు ఎదురయినట్టు వాపోయారు. ఆటబొమ్మలను ఆడించినట్టు తమను ఆడిస్తూ, 'కొందరిని హ్యాపీ'గా ఉంచాలని నిర్వాహకులు తాపత్రయపడ్డారని మ్యాగీ మండిపడ్డారు. దీంతో తాను ఉండలేకపోయానని తెలిపారు. తామిచ్చిన ప్రదర్శనలు బోరింగ్‌గా ఉన్నాయంటూ ఓ మహిళా నిర్వాహకురాలు తన మర్యాదకు భంగం కలిగించే విధంగా దురుసుగా మాట్లాడినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఓ దేశానికి ప్రతినిధులమన్న విషయాన్ని కూడా మరిచి ఎంతో అమర్యాదగా పిల్లలతో ప్రవర్తించినట్టు తమతో మసులుకొన్నారని వాపోయారు. ఈ అనైతిక వ్యవహారం నచ్చకపోవడం వల్లే పోటీల నుంచి వైదొలిగినట్టు తెలిపారు. అప్పటికీ ఇప్పటికీ మిస్ వరల్డ్ పోటీల్లో ఏ మార్పు రాలేదని, 1960, 70లలో అందాల ప్రదర్శనలా ఈ పోటీలు ఎలా జరిగేవో ఇప్పుడు కూడా శారీరక ప్రదర్శనకు ప్రాధాన్యం ఇస్తూ పోటీలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఆస్కార్ వేడుకల్లో విభిన్న వస్త్రాలతో ఎలా హొయలుపోతారో మిస్ వరల్డ్ పోటీలు కూడా అలాగే తయారయ్యాయని ధ్వజమెత్తారు.

### హైదరాబాద్ ప్రతిష్ఠ అభాసుపాలు

హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలు చేయడం అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశమైంది. మ్యాగీ ఆరోపణలతో హైదరాబాద్ ప్రతిష్ఠ పెరగడం సంగతి పక్కనపెడితే, మొత్తంగా పోటీల అస్తిత్వం, నగర ఖ్యాతి దెబ్బతిన్నాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'మిస్ వరల్డ్' పోటీల నిర్వహణ ద్వారా ప్రభుత్వం చెప్పినట్టు అంతర్జాతీయ కంపెనీల నుంచి తెలంగాణకు పెట్టుబడుల వరద వచ్చిపడటం ఏమోకానీ, హైదరాబాద్, తెలంగాణ ప్రతిష్ఠ అభాసుపాలయిందని మేధావులు చర్చించుకొంటున్నారు. పోటీల నిర్వాహకులు ఎవరైనా, కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడంతో నగరానికి ఇదో మాయని మచ్చగా మారినట్టు చెప్తున్నారు. మ్యాగీ ఇప్పటికే మిస్ ఇంగ్లండ్ కిరీటాన్ని కైవసం చేసుకొన్నారు. అలాంటి మహిళ భరించలేని స్థాయిలో ఆవేదన కలిగిందంటే కారణాలను వెదకాల్సిన అవసరం ఉన్నదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమ నిర్వాహకులెవరు? ఆ వ్యవహారం మన సంస్కృతీ, సంప్రదాయానికి సరిపోతుందా? లేదా? అనే విషయాన్ని ప్రభుత్వం కూడా చూడాల్సిందని చెప్తున్నారు. ఇప్పటికైనా బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు ప్రభుత్వం తరుపున లేఖలు రాయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తున్నారు.

### నిర్వాహకుల తీరుతో నిద్రకూడా పట్టలేదు

అమ్మ చెప్పిన మాటలకు హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల తీరుకు ఎంతో వ్యత్యాసం ఉన్నది. నిర్వాహకులు నా పట్ల వ్యవహరించిన తీరు ఎంతో దారుణంగా ఉండేది. అది నాకు అస్సలు నచ్చలేదు. వాళ్ల వ్యవహారంతో కొన్ని రోజులపాటు నిద్రకూడా పట్టలేదు. పోటీల నుంచి వైదొలుగబోతున్నట్టు ముందుగానే అమ్మకు చెప్పేశా. ఇంగ్లండ్ చేరుకోగానే అమ్మను పట్టుకొని ఏడ్చేశా. నన్ను, ఇతర పోటీదారులను ఓ అంగడి సరుకుగా చూశారని నా బాధను అమ్మతో చెప్పుకొన్నా.

**- 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ**

### నేనేమైనా వేశ్యనా?

ముందు ఇవన్నీ నేను నమ్మలేకపోయా. కానీ జరుగుతున్న పరిణామాలతో షాక్‌కు గురయ్యా. ఇవన్నీ నాకు తప్పుగా అనిపించాయి. ధనవంతులను అలరించేందుకు నేను ఇక్కడికి రాలేదు అనిపించింది. మిస్ వరల్డ్ పోటీలు విలువలతో ఉంటాయని భావించి వచ్చా. అయితే ఇక్కడ అలా లేదు. గతంలో జరిగినట్టే ఇంకా కొనసాగుతున్నది. మొత్తంగా నిర్వాహకుల తీరుతో 'నేనేమైనా వేశ్యనా' ఏంటి? అనే భావన నాకు కలిగింది.

**-ప్రఖ్యాత 'ది సన్' పత్రికతో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ**

### రాగానే అమ్మకు చెప్పుకొని ఏడ్చేశా..

యూకేలో టాబ్లాయిడ్ జర్నలిజం అనేది ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు నకిలీ పోస్టులు కూడా వైరల్‌గా మారుతాయి. దీంతో మ్యాగీపై ప్రచురించిన కథనం నిజమో? కాదో? తెలుసుకోవడానికి 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి ఆమెను సంప్రదించారు. దీంతో హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో తాను భయానక అనుభవాలను ఎదుర్కొన్నట్టు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఒప్పుకొన్నారు. "అందాల పోటీ అంటే శారీరక సౌందర్యాన్ని మాత్రమే చూడరని మా అమ్మ చెప్తుంది. మహిళలోని ఆత్మవిశ్వాసం, సేవాగుణం, స్ఫూర్తి, ప్రవర్తన, నడవడిక, చురుకైన ఆలోచనలు ఇలా అన్నీ చూస్తారని చెప్పేది. అమ్మ చెప్పిన మాటలకు, హైదరాబాద్‌లో పోటీల తీరుకు చాలా తేడా ఉంది. నిర్వాహకులు నా పట్ల చాలా దారుణంగా వ్యవహరించారు. వాళ్ల వ్యవహారంతో కొన్ని రోజులపాటు నిద్ర కూడా పట్టలేదు. పోటీల నుంచి వైదొలగబోతున్నట్టు ముందుగానే అమ్మకు చెప్పేశా. ఇంగ్లండ్ చేరుకోగానే అమ్మను పట్టుకొని ఏడ్చేశా. నన్ను, ఇతర పోటీదారులను ఓ అంగడి సరుకుగా చూశారని నా బాధను అమ్మతో చెప్పుకొన్నా" అంటూ మ్యాగీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ది సన్'లో వచ్చిన కథనం నిజమేనని ధ్రువీకరించారు.

### మ్యాగీ స్థానంలో చార్లొటే గ్రాంట్

మిస్ వరల్డ్ పోటీల నుంచి మ్యాగీ వైదొలగడంతో మిస్ ఇంగ్లండ్ 2024 రన్నరప్ చార్లొటే గ్రాంట్ (25)ను ఇంగ్లండ్ నుంచి పోటీల్లో నిలిపినట్టు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. వచ్చే శనివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



### మ్యాగీ ఆరోపణలు నిరాధారం

మిస్ ఇంగ్లండ్ మ్యాగీ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి. అసంబద్ధమైనవి. యూకే పత్రికా కథనాలు వాస్తవ దూరం. అవి మిస్ వరల్డ్ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. భారత్‌లో పోటీ జరుగుతున్న సమయంలో మ్యాగీ చాలా సంతోషంగా ఉన్నారు. వాటికి సంబంధించిన వీడియోలు కూడా విడుదల చేశాం. తన తల్లి ఆరోగ్యం క్షీణించిందని మ్యాగీ చెప్పడంతోనే పోటీల నుంచి వైదొలగడానికి ఆమెకు అనుమతినిచ్చాం.

**-జూలీ మోర్లే, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో, చైర్‌పర్సన్**

## దేశం పరువు తీసిన కాంగ్రెస్ సర్కారు

**ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి**

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీల పేరిట దేశ పరువు తీసిందని ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న మిస్‌వరల్డ్ పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ వైదొగులుతూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె తనను వేశ్యలా చూశారని, పోటీదారులా గౌరవించకుండా షోపీస్‌లా చేశారని చెప్పడం చూస్తుంటే కాంగ్రెస్ సర్కారు మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణలో ఎంత ఘోరంగా విఫలం చెందిందో తెలిసిపోయిందని విమర్శించారు. స్త్రీలను గౌరవించే దేశమని చెప్పుకునే భారత్‌కు.. ప్రపంచంలో ఉన్న గుర్తింపును కాంగ్రెస్ సర్కారు దుర్మార్గపు చర్యలతో మంటగలిపిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు ప్రజల సొమ్ము రూ. 250కోట్లు దుబారా చేసి మరీ.. భారత్ పరువును గంగలో కలిపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో యూకేలోని ప్రవాసీ తెలంగాణవాసులు ఎంతో బాధపడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అనవసరపు ఆర్భాటాలకు పోకుండా.. ప్రజలకు మంచి చేయాలని ఆయన హితవు పలికారు.

## డాలస్‌లో రజతోత్సవ సందడి

- అమెరికాలో -జూన్ 1న వేడుకలు
- తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా డాక్టర్ పెప్పర్ ఎరినా ముస్తాబు
- యూఎస్‌లోని పలు నగరాల్లో జోరుగా సన్నాహక సమావేశాలు
- హాజరవుతున్న తెలంగాణ నేతలు



హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఎక్కడ చూసినా బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై సందడి నెలకొన్నది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, బీఆర్‌ఎస్ రజతోత్సవాలను ఏకకాలంలో జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు (మనకు జూన్ 2, తెలంగాణ రాష్ట్ర అవతరణ తేదీ) డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఎరినాలో బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశాలు కొనసాగుతున్నాయి. అమెరికాలోని పలు నగరాల్లో 'చలో డాలస్' అనే నినాదాలతో స్టేజీ మీటింగ్స్ జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఎన్నారైలు ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఇప్పటికీ అదే ఉత్సాహం చూపుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గ్లోబల్ విభాగం ఆధ్వర్యంలో ఖండాంతరాల్లో అదీ అమెరికాలో వేలాది మందితో సభను నిర్వహించడం తొలిసారి. బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై విభాగం నిర్వహించే ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు సైతం ఆయా నగరాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఇప్పటికే అమెరికాలోని పలు నగరాల్లో స్టేజీ మీటింగ్స్ నిర్వహిస్తున్నారు. పార్టీ గ్లోబల్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, ఎన్నారై సెల్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్, శ్రీనివాస్ తుర్కంటి సమన్వయంతో ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, మంత్రి హోదాలోనూ అనేకసార్లు అమెరికాలో పర్యటించిన సందర్భాల్లో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు డాలస్ సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతుండటంతో అమెరికావ్యాప్తంగా ఉన్న తెలంగాణవాదులు ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మహేశ్ బిగాల తెలిపారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా ప్రాంగణాన్ని తెలంగాణ కళా సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

### సన్నాహక సమావేశాల జోరు

డాలస్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి కూడా పలువురు బీఆర్‌ఎస్ నేతలు అమెరికాకు బయలుదేరి వెళ్తున్నారు.

- ఈనెల 26న ఆస్టిన్, టెక్సాస్‌లో జరిగే సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, పెద్దిరెడ్డి, బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ తదితరులు హాజరుకానున్నారు. న్యూజెర్సీలో జరిగే సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్ చంటి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పాల్గొననున్నారు.
- ఈ నెల 27న 27 నెవార్క్ డెలావేర్‌లో జరిగే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్ చంటి పాల్గొననున్నారు.
- 28న అష్బుర్న్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొననున్నారు. వీటితోపాటు అట్లాంటా, కొలంబస్, లాస్ ఏంజెల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, ఫ్లోరిడా నగరాల్లోనూ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

### వీ మీట్ ఎట్ డాలస్

జూన్1న డాలస్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకకు అమెరికా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎన్నారై గ్లోబల్ సెల్ స్థానికంగా విస్తృత ప్రజాదరణ ఉన్న కమ్యూనిటీ రేడియోల్లో డాలస్ మీటింగ్‌కు కేటీఆర్ వస్తున్నారంటూ ప్రచారం ప్రారంభించింది. జూన్ 1.. డాక్టర్ పెప్పర్ ఎరినా... బీఆర్‌ఎస్ బిగ్ గ్యాదరింగ్, వీ మీట్ ఎట్ డాలస్ అంటూ బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో 52 దేశాల్లోని సోషల్‌మీడియా వేదికలపై ప్రచారం చేస్తున్నట్టు మహేశ్ బిగాల పేర్కొన్నారు.

### కుటుంబంతో రండి: మహేశ్ తన్నీరు

జూన్ 1న డాలస్‌లో బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై నిర్వహించే సమావేశానికి అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉన్న తెలంగాణ బిడ్డలు తమ కుటుంబసభ్యులతో కలిసి రావాలని యూఎస్‌ఏ బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు పిలుపునిచ్చారు. శనివారం వెస్ట్‌ఫ్రిస్కో నగరంలో బీఆర్‌ఎస్ మద్దతుదారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీ-టాబ్‌కు చెందినవారు తమ సంస్థ నుంచి 1,500 మందికి తగ్గకుండా హాజరవుతామని ప్రకటించారు. కార్యక్రమంలో రాజ్ పడిగల, నవీన్ కానుగంటి, రజనీకాంత్ కొసనం, రాజ్ ఆనందేశి, మనోజ్ ఏనుగంటి తదితరులు పాల్గొన్నారు.

## లేని ఫ్యాకల్టీని ఉన్నట్టుగా..

- 'గోకరాజు రంగరాజు' నిర్వాకం
- జేఎన్టీయూ తనిఖీలు ఉత్తవే
- అనైతిక పద్ధతి అనుసరిస్తున్నరు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?
- ఉన్నత విద్యామండలి సహా జేఎన్టీయూకు గోకరాజు రంగరాజు కాలేజీ అధ్యాపకుల ఫిర్యాదు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : 'క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ లేరు.. డమ్మీలను పెట్టి నడిపిస్తున్నారు. అఫిలియేషన్ కోసం సమర్పించినవన్నీ తప్పుడు వివరాలే. కాలేజీకి మాక్ వర్చువల్ టూర్‌కు కావల్సిన ఇంటర్నెట్ సౌకర్యమే లేదు. కానీ డీమ్డ్ వర్సిటీ కోసం దరఖాస్తు చేశారు..' అంటూ హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (జీఆర్ఐఈటీ)పై అదే కాలేజీకి చెందిన ఉద్యోగులు ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూకు ఫిర్యాదులు చేశారు. ఈ-మెయిల్ ద్వారా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తంకు జేఎన్టీయూ వీసీ, రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులో అనేక ఆరోపణలు చేశారు. జేఎన్టీయూ నియమించిన నిజనిర్ధారణ కమిటీని కాలేజీ యాజమాన్యం లోబర్చుకుని, అనుకూలంగా రిపోర్టులు ఇప్పించుకున్నట్టు ఉద్యోగులు ఆయా లేఖలో ఫిర్యాదుచేశారు. కాలేజీలో జరుగుతున్న విషయాలపై అనేకసార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశామని, అయినా స్పందనలేదని విస్మయం వ్యక్తంచేశారు.

### అధ్యాపకులు లేవనెత్తిన అంశాలు..

- ఫ్యాకల్టీ అప్రైజల్ విషయంలో అనేక అవకతవకలున్నాయి. ఫ్యాకల్టీకి ఇంక్రిమెంట్లు ఇవ్వడంలేదు.
- రీసెర్చ్ పబ్లికేషన్లు అంతా మోసం. పరస్పర సహకారం (మ్యూచువల్ కొలాబరేషన్స్) ముసుగులో మోసపూరిత పద్ధతులు అవలంభిస్తున్నారు. రీసెర్చ్‌నిధులను వినియోగిస్తున్నారా..? అంటే ప్రశ్నార్థకమే.
- న్యాక్, ఎన్‌బీఏ, ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు, జేఎన్టీయూ ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల కోసం తప్పుడు వివరాలు(మ్యానిపులేటెడ్ డాటా) సమర్పిస్తున్నారు. తనిఖీ బృందాలకు అందించే ప్లేస్‌మెంట్స్, ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారుసహా డిపార్ట్‌మెంట్లవారీగా సమర్పించేవన్నీ తప్పుడు సమాచారమే.
- తనిఖీలకు వచ్చే అధికారులు, బృందాలను కాలేజీ నిర్వాహకులు ప్రభావితం చేస్తున్నారు. లోబర్చుకుంటున్నారు. అనైతిక మార్గాల ద్వారా మెరుగైన సిఫార్సులు చేయించుకుంటున్నారు.
- డీమ్డ్ టు బీ యూనివర్సిటీ హోదా కోసం సమర్పించిన వివరాలన్నీ తప్పుడు, తారుమారు చేసినవే. డీమ్డ్ వర్సిటీ అక్రిడిటేషన్ కోసం మాక్ వర్చువల్ టూర్ చేయాలి. ఈ టూర్ నిర్వహించేందుకు సరైన ఇంటర్నెట్ సౌకర్యమేలేదు.

### జేఎన్టీయూకు ప్రశ్నలు..

- నిజనిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) కాలేజీలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ వివరాలను పరిశీలించిందా..? బయోమెట్రిక్ హాజరును పరిశీలించారా..? కొన్ని డిపార్ట్‌మెంట్లలో పేరుకే ఫ్యాకల్టీ ఉన్నారు. వాస్తవికంగా ఉండటంలేదు. అనుమానముంటే నెలవారీగా ఫ్యాకల్టీ బయోమెట్రిక్ హాజరు, నెలవారి శాలరీ స్టేట్‌మెంట్స్‌ను పరిశీలించండి.
- జేఎన్టీయూ తనిఖీ చేసిన సమయంలో కొంత మంది ఫ్యాకల్టీ గైర్హాజరయ్యారు. కొంత మంది డమ్మీలను కమిటీ ముందు ప్రదర్శించారు. ఒక్కరే పదే పదే కనిపిస్తారు. కావాలంటే వీడియో రికార్డు చూడండి. లేదంటే క్యాంపస్‌లో మరోసారి తనిఖీలు చేయండి.
- కాలేజీలో సరిపడా మౌలిక వసతుల్లేవు. చాలా పరికరాలు పనిచేయడం లేదు. ల్యాబ్‌ను సందర్శించకుండానే కమిటీ ఆమోదం తెలిపింది.
- ఫ్యాకల్టీ జీతం, ఇంక్రిమెంట్‌లను క్రాస్ వెరిఫై చేయండి. జూలై 2022, ఏప్రిల్ 2025 నెలల్లో జీతాలను సరిపోల్చండి. ఏప్రిల్ 2025తో పోల్చితే 2022 జూలై జీతాలు ఎక్కువగా ఉంటాయి. ఇదేలా సాధ్యం.. యాజమాన్యం కేవలం ఖాతాల్లో అదనపు మొత్తాన్ని జమచేసి, తిరిగి వసూలు చేసుకుంటున్నారు.
- ఇంక్రిమెంట్లను క్రాస్ వెరిఫై చేయలేదు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, సిబ్బందికి వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వలేదు. సరికదా ప్రశ్నిస్తే ఫ్యాకల్టీని బెదిరిస్తున్నారు.

## ఏఎంవీఐలకు నియామకపత్రాలు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రవాణాశాఖలో మరో ఆరుగురు అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)లకు శనివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియామక పత్రాలు అందజేశారు. గతంలో 96 మందికి నియామకపత్రాలు ఇవ్వగా తాజాగా ఆరుగురికి అందజేశారు. విధుల్లో సక్రమంగా, నిజాయతీగా పని చేయాలని, రవాణాశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కోర్టు కేసుల వల్ల ఆరుగురి నియామకాలు పెండింగ్‌లో ఉండడంతో ఇన్ని రోజులు ఆలస్యమైందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, సీఎం సెక్రటరీ శ్రీనివాస్‌రాజు, రవాణాశాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పట్టా మార్పిడికి రూ.7 వేల లంచం

**నిర్మల్ జిల్లాలో ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్**

కడెం, మే 24 : ఓ రైతు వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఓ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడిన ఘటన నిర్మల్ జిల్లాలో శనివారం చోటు చేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ వివరాల ప్రకారం.. కడెం మండలం గంగాపూర్‌కు చెందిన రైతు గుగ్లావత్ ప్రభాకర్ తన తండ్రి మరణానంతరం ఐదెకరాల పట్టా మార్పిడిలో భాగంగా కొలతల ప్రొసీడింగ్ కోసం తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. కడెం మండల సర్వేయర్ ఉమాజీని కలువగా ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.25 వేల వరకు డిమాండ్ చేసి రూ.20 వేల లంచం ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో నుంచి రూ.12 వేలను గత నెల 28న ఇవ్వగా, మరో రూ.8 వేల కోసం నిత్యం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ప్రభాకర్ శనివారం రూ.7 వేలు సర్వేయర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సర్వేయర్‌ని అదుపులోకి తీసుకుని తహసీల్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.



ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్ పవార్ ఉమాజీ



భవన శిథిలాల కింద పడి ధ్వంసమైన ఎక్స్‌కవేటర్

## ఇష్టారాజ్యంగా కూల్చివేతలు

- రామగుండంలో ఎలాంటి భద్రతా చర్యలు లేకుండానే త్రీఫ్లోర్ భవనం నేలమట్టం
- తెగిపడిన విద్యుత్తు తీగలు
- శిథిలాల కింద ఎక్స్‌కవేటర్
- మృత్యుంజయుడైన డ్రైవర్
- భయంతో జనం పరుగు

కోల్‌సిటీ, మే 24: రామగుండం నగర పాలక సంస్థ అధికారులు, అధికార పార్టీ నేతల తీరు మితిమీరుతుననది. అభివృద్ధి పేరుతో కూల్చివేతల పర్వం వివాదాలకు దారి తీస్తున్నది. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయ కాలనీలో రోడ్ల అభివృద్ధి పేరుతో నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం మూడంతస్తుల భవనాన్ని కాంగ్రెస్ నాయకులు, పోలీస్ పహారా మధ్య ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయడం ప్రారంభించారు. సివిల్ కాంట్రాక్టర్‌కు చెందిన ఆ భవనాన్ని సదరు యజమాని ముందు రోజు రాత్రి నుంచే స్వచ్ఛందంగా తొలగిస్తున్నాడు. కాంగ్రెస్ నాయకుల పురమాయింపుతో నగరపాలక అధికారులు ఎక్స్‌కవేటర్ వాహనాలతో అక్కడకు వచ్చి తామే కూల్చివేస్తామని రంగంలోకి దిగారు. ఎలాంటి రక్షణ గానీ, భద్రత గానీ లేకుండా ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఒక్కో అంతస్తును కూల్చివేస్తుండగా అధికారులు జారుకున్నారు. పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఇంతలోనే భవనం ఒక్కసారిగా కుప్పకూలగా ప్రధాన రోడ్డుపై ఉన్న విద్యుత్తు తీగెలు, స్తంభాలు ఆ శిథిలాల కింద నేలమట్టమయ్యాయి. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ శిథిలాల కింద చిక్కుకుపోయాడు. అదృష్టవశాత్తు మృత్యుంజయుడై గాయాలతో బయటకు వచ్చాడు. ఎక్స్‌కవేటర్ శిథిలాల కింద ధ్వంసమైంది. అంత పెద్ద భవనం కూల్చివేసే ముందు ఒక పద్ధతి, ప్రణాళిక, భద్రత లేకుండా కూల్చివేయడంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. భవనం కుప్పకూలే సమయంలో శిథిలాలు ఎగిరి వచ్చి ప్రజల మీద పడి ప్రాణనష్టం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు.

## డీజే కేసులో రూ.15వేలు లంచం

**ఎస్ఐతోపాటు మరొకరిని పట్టుకున్న ఏసీబీ అధికారులు**

జగద్గిరిగుట్ట మే 24: సీజ్ చేసిన డీజే సౌండ్ సిస్టం ఇవ్వటానికి లంచం డిమాండ్ చేసిన ఎస్ఐతోపాటు మరొకరిని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు పట్టుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. పాపిరెడ్డినగర్‌కు చెందిన కిరణ్ డీజే నిర్వాహకుడు. మూడు నెలల క్రితం అధిక శబ్దంతో డీజే నిర్వహించాడని, పోలీసులు డీజే పరికరాలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసు నుంచి బయటపడాలని కిరణ్ పలుమార్లు పోలీసులను కలిశాడు. ఆ కేసును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ శంకర్ రూ.15 వేలు లంచాన్ని మధ్యవర్తి నాగేందర్‌కు ఇస్తే సామగ్రి అప్పగిస్తానని చెప్పాడు. దీంతో బాధితుడు కిరణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో కిరణ్ ఎస్ఐ సూచన మేరకు నాగేందర్‌కు డబ్బులు ఇస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బృందం పట్టుకున్నారు. అతడిని విచారించగా ఎస్ఐ శంకర్ సూచనతో డబ్బులు తీసుకున్నట్టు వెల్లడించాడు. ఎస్ఐ శంకర్‌తోపాటు మధ్యవర్తి నాగేందర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో తనిఖీ చేశారు. పట్టుబడ్డ వారిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు.


**కళ్యాణమస్తు**

**వధువు కావలెను**

★ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, 28 వేలు, ఆస్థి 1 కోటి, నల్లగొండ, వీరయ్య, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డుకు వ్రాయండి.